సాక్షి అనకాపల్లి

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



ధర నిష్ఫలం

దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్లో టమాటా ధర ఆదివారం ఒక్కసారిగా కిలో రూ.2లకు పడిపోయింది. 8లో



బిడ్డతో కలిసి హోంగార్డు ఆత్మహత్య

- మృతురాలిది కశింకోట
- ఘటనకు కుటుంబ కలహాలే కారణం

-వార్త మెయిన్‌లో..

షాకిచ్చిన కరెంటు బిల్లు



గిరిజన తండాలో జనానికి రూ.వేలల్లో బిల్లులతో కరెంటు షాక్ ఇచ్చింది. డోలవాని పాలెంలో ఓ గిరిజనుడి ఇంటికి రూ.1.60 లక్షల బిల్లు వచ్చింది. 8లో



తోటలు తొలగించి బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంబిస్తున్న దృశ్యం

పరిహారం చెల్లింపులో
పక్షపాతం

- డీఫారం రైతులకు తీరని అన్యాయం
- ఫలసాయానికి పరిహారం ఇవ్వని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు
- 2500 ఎకరాలల్లో 2వే లమంది రైతులకు
- పదేళ్లయినా అందని నష్టపరిహారం

నక్కపల్లి: ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతుల పట్ల కూటమి ప్రభుత్వం పక్షపాతం చూపిస్తోంది. జిరాయితీ రైతులకు ఒకలా, డీఫారం రైతులకు మరోలా నష్టపరిహారం చెల్లిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఏళ్ల తరబడి తమ భూముల్లో మామిడి, జీడి తోటలు వేసి పెంచి ఫలసాయం అనుభవిస్తున్నామని, పరిశ్రమల పేరుతో భూములు బలవంతంగా లాక్కొని తమకు జీవనాధారమైన ఉద్యాన వన పంటలకు నష్టపరిహారం చెల్లించకుండా తాత్సారం చేయడం పట్ల రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. జిరాయితీ రైతులతోపాటు, డీఫారం, సాగుదార్ల నుంచి భూములు సేకరించారని భూములకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపుల్లోను అన్యాయం చేశారని, అలాగే పంట నష్టపరిహారం విషయంలో కూడా అన్యాయం చేస్తున్నారంటూ మండి పడుతున్నారు. నక్కపల్లి మండలంలో విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2010వ సంవత్సరంలో భూములు సేకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. **తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా సుమారు 4500 ఎకరాలు సేకరించారు. వీటిలో జిరాయితీ భూములు 2వేల ఎకరాలు కాగా డీఫారం, ప్రభుత్వ సాగుభూములు మరో 2500 ఎకరాలు ఉన్నాయి. అప్పట్లో జిరాయితీ భూములకు ఎకరాకు రూ.18 లక్షల చొప్పున, డీఫారం భూములకు ఎకరాకు రూ.12లక్షల చొప్పున, ప్రభుత్వ భూములు సాగు** చేసుకుంటున్న వారికి ఎకరాకు రూ.6 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించారు. జిరాయితీ భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారంతో పాటు, భూముల్లో ఉన్న మామిడి, జీడి, కొబ్బరి తదితర ఉద్యాన వన పంటలతోపాటు, ఇళ్లు, పశువుల షెడ్లకు సైతం నష్టపరిహారం చెల్లించారు. మామిడి, జీడి చెట్లకు ఒక్కో దానికి రూ.600 నుంచి 800, కొబ్బరి చెట్లకు రూ.1500 చొప్పున నష్టపరిహారం చెల్లించారు. డీఫారం, ప్రభుత్వ భూముల్లో ఉన్న పంటలకు మాత్రం నష్టపరిహారం చెల్లించలేదు. వీరికి కూడా నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం హామీ ఇచ్చి వీరి నుంచి భూములు లాక్కొందని రైతులు ఆరోపిస్తున్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో 2వేల ఎకరాలను బల్క్ డ్రగ్ పార్క్ కోసం కేటాయించారు. తాజాగా **కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బల్క్‌డ్రగ్ పార్క్‌కు ప్రధాని నరేంద్రమోదీతో శంకుస్థాపన చేయించడంతో పార్క్ పనులు ప్రారంభమయ్యాయి. రైతుల నుంచి సేకరించిన భూముల్లో మామిడి, జీడి, కొబ్బరి తోటలను జేసీబీలు, పొక్లెయినర్లతో తొలగించి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణపు పనులు చేపడుతున్నారు. అయితే ఏపీఐఐసీ వారు భూములు సేకరించిన రాజయ్యపేట, చందనాడ, డీఎల్‌పురం, వేంపాడు, అమలాపురం గ్రామాల పరి**ధిలో సుమారు 2500 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 2వేల మంది రైతులు ఈ భూముల్లో మామిడి, జీడి, కొబ్బరి సాగు చేస్తున్నారు. వీరికి ఎటువంటి పరిహారం చెల్లించకుండానే తోటల తొలగింపు ప్రక్రియ ప్రారంభించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే టీడీపీ ప్రభుత్వం నబ్బవరం మండలం వంగలి వద్ద అపెరల్ పార్క్ కోసం సేకరించిన భూముల్లో డీఫారం రైతులకు సంబంధించి **మామిడి, జీడి చెట్లకు రూ.1200 చొప్పున నష్టపరిహారం చెల్లించిందని, అలాగే నక్కపల్లి మండలం బంగారయ్యపేటలో ఆక్వా క్వారంటైన్ ల్యాబ్ కోసం సేకరించిన భూముల్లో డీఫారం రైతులకు జీడిచెట్లకు రూ.650 చొప్పున చెల్లించిందని, తమ వద్దకు వచ్చేసరికి అన్యాయం చేయాలని చూస్తోందంటూ** రైతులు వాపోతున్నారు. జిరాయితీ రైతుల మాదిరిగానే తమ భూముల్లో ఉన్న చెట్లకు కూడా నష్టపరిహారం చెల్లించాలని, పరిహారం చెల్లించిన తర్వాత బల్క్ డ్రగ్‌పార్క్ పనులు ప్రారంభించాలని కోరుతూ బాధిత రైతులంతా గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కలెక్టర్, ఆర్డీవో, హోంమంత్రిల వద్దకు పలు పర్యాయాలు వెళ్లి వినతి పత్రాలు అందజేశారు.

మాకెందుకివ్వరు?



మాకు ఎకరంన్నర డీఫారం భూమి ఉంది. దాదాపు పాతికేళ్ల నుంచి మామిడి, జీడి తోటలు వేసి సాగు చేస్తూ ఫలసాయం అనుభవిస్తున్నాం. మా కుటుంబానికి ఇదే జీవనాధారం. ప్రభుత్వం కంపెనీల కోసం మా భూములు తీసుకుంది. భూములకు మాత్రమే డబ్బులిచ్చారు. చెట్లకు ఇవ్వలేదు. మిగిలినోళ్లందరికి ఇచ్చి మా భూములకు ఎందుకు ఇవ్వరు? డీఫారం పట్టా భూములిచ్చినోళ్లకు ఎవరికి ఇవ్వలేదు. ఇది చాలా అన్యాయం. మాకు కూడా నష్టపరిహారం ఇవ్వాల్సిందే. ఇచ్చేకే మా భూముల్లో తోటలు నరకాలి.

–అల్లు అంజమ్మ, మహిళారైతు, డీఎల్‌పురం



డీఫారం భూముల్లో రైతులు సాగుచేస్తున్న మామిడి జీడి తోటలు

పరిహారం ఇవ్వకుండా తోటలు తొలగించొద్దు..

డీఫారం భూముల్లో జీడి, మామిడి తోటలకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదు. రైతులకు చాలా నష్టం జరుగుతుంది. ఫలసాయానికి పరిహారం చెల్లించకుండా తోటలు తొలగించడానికి వీల్లేదు. రైతులంతా ఆందోళన చెందుతున్నారు. డీఫారం రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించాలి. –జి.చిన తాతారావు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు

కంటి వెలుగులు..
కన్నీటిపాలు

అయ్యోదేవుడా ఎంత పని జరిగిపోయింది...కళ్ల ముందే కన్నకొడుకులు కెరటాల్లో కొట్టుకుపోయారు..ఇక మాకు దిక్కెవరూ.. స్నానం చేసి వెంటనే వచ్చేస్తాము, వచ్చిన వెంటనే.. ఇంటికి వెళ్లిపోదాము అంటూ వెళ్లారు...అంతలోనే గంగలో కలసిపోయారా నాయనలారా... అంటూ కన్నవాళ్ల రోదనలతో చూపరులు కన్నీటి సంద్రమయ్యారు. చేతికి అంది వచ్చిన కుమారులు కళ్ల ముందే సముద్రంలో కొట్టుకుపోయినా కాపాడలేని నిస్సహాయ స్థితిలో విలపించారు.

- వాడపాలెం తీరంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి ఆచూకీ దొరకని వైనం
- మత్స్యకారులు, మెరైన్ పోలీసుల సాయంతో గాలింపు



సూర్యతేజ మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు



మృతుడు సూర్యతేజ(ఫైల్)



గల్లంతైన పవన్‌తేజ్ (ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి), అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడపాలెం సముద్రతీరంలో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు స్నానానికి దిగి గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభించగా, మరొకరి ఆచూకీ తెలియలేదు. ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి సీఐ సీహెచ్ నరసింగరావు, మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రాంబిల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములైన మొక్కశ్రీధర్, మొక్క మల్లికార్జునరావు వృత్తి రిత్యా విశాఖపట్నంలో వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మొక్క శ్రీధర్ ఎల్‌అండ్‌టీ కంపెనీలో పనిచేస్తూ కంచరపాలెం ఇందిరానగర్‌లో పాప బాబుతో నివసిస్తున్నాడు. మల్లికార్జునరావు సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ దువ్వాడ దగ్గర సంధ్యనగర్ వద్ద ఒక పాప, బాబు, భార్యతో కలసి నివాసం ఉంటున్నాడు. వీరిలో శ్రీధర్ కుమారుడు, సూర్య తేజ్ (17) తగరపువలస దగ్గర అనిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రథమ సంవత్సరం కెమికల్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మల్లికార్జునరావు కుమారుడు పవన్‌తేజ (17) దువ్వాడ వద్ద ఉన్న విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. వీరు ఆదివారం ఉదయం సూర్యదేవుని నోములు పండగను స్వగ్రామంలో కుటుంబ సభ్యులు అందరితో జరుపుకోవడానికి వచ్చారు. ఉదయం పూజలు చేసుకుని మధ్యాహ్నం వాడపాలెం సముద్రతీర ప్రాంతానికి ఇరువురి కుటుంబాలు కలసి వెళ్లారు. అక్కడ ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం 3.30 నుంచి 4 గంటల సమయంలో సూర్యతేజ, పవన్‌తేజ సముద్రంలో స్నానానికి వెళ్లి కెరటాల ఉధృతికి కొట్టుకుపోయారు. సమీపంలో ఉన్న మత్స్యకారులు సమాచారం తెలుసుకుని సహాయక చర్యలు చేపట్టగా సాయంత్రం సూర్యతేజ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ మత్స్యకారులకు చిక్కాడు. వారు సూర్యతేజకు సీపీఆర్ ప్రథమ

మిగతా 8వ పేజీలో ▶

పంట పుష్కలం.. ధర నిష్ఫలం

రైతు బతుకు ఎప్పుడూ జూదమే. ప్రకృతిని నమ్మి పెట్టుబడి పెడతాడు. సుఖమెరుగక రేయింబవళ్లు శ్రమిస్తాడు. అందిన కాడికి అప్పులు చేసి సాగు చేస్తాడు. ఈ దశలో తొలి గండం తుపాన్లు.. ప్రకృతి వైపరీత్యాల రూపంలో రైతును భయపెడుతుంది. ఒకవేళ ఆ గండం దాటగలిగితే మరో ప్రమాదం కబళించాలని చూస్తుంటుంది. అదే.. మార్కెట్ ఒడిదుడుకుల వైకుంఠపాళి సర్పం. హఠాత్తుగా పడిపోయే ధరలు.. మార్కెట్‌కు వెల్లువెత్తే సరకు వంటివి రైతు తీసుకొచ్చే సరకుపై పెను ప్రభావం చూపుతాయి. పలు ప్రాంతాల నుంచి రైతులంతా ఒకే రకం సరకు తీసుకొస్తే ధర పడిపోతుంది. ఆదివారం దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్లో అదే జరిగింది. ఇక్కడి శ్రీరాంపురం, దేవరాపల్లి తదితర ప్రాంతాల రైతులు తీసుకొచ్చిన టమాటా ధర అమాంతం పడిపోయి రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీనికి కారణం మార్కెట్‌ను టమాటాలు ముంచెత్తడమే.

- ఘోరంగా పతనమైన టమాటా ధర
- కిలో రూ. 2కు పడిపోయిన వైనం
- దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో దారుణ పరిస్థితి
- భారీగా నష్టపోయిన రైతులు



మార్కెట్లో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న టమాటా రైతులు



దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌కు అధిక మొత్తంలో వచ్చిన టమాటా నిల్వలు

దేవరాపల్లి: స్థానిక హోల్‌సేల్ మార్కెట్లో టమాటా ధర ఒక్కసారిగా పడిపోయింది. వారం రోజుల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధర ఆదివారం ఘోరంగా పతనమైంది. స్థానిక మార్కెట్‌లో కిలో టమాటా రూ. 2కి పడిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. 30 కేజీల ట్రే రూ. 80 నుంచి రూ. 90 పలికింది. ఈ ధరకు కూడా కొనేందుకు ఎవరూ మొగ్గు చూపక పోవడంతో గంటల తరబడి ఎదురు చూసి గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పెట్టుబడి సొమ్ము సరికదా కనీసం కూలీ ధర, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం లేకపోయినా వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడితో సాగు చేసిన రైతుకు శ్రమే మిగిలుతోంది. రెండు నెలల క్రితం టమాటా ధరలు ఆకాశాన్నంటడంతో రైతులు టమాటా సాగుపై దృష్టి సారించారు. దిగుబడి ఆశాజనంగా ఉండటంతో నాలుగు రూపాయలు వెనకేసుకుందామని ఆశించిన తరుణంలో నిరాశే మిగిలింది. పంట చేతికందే సమయంలో ధర లేకపోవడంతో తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారు. మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు రాని దయనీయ పరిస్థితి నెలకొనడంతో కొందరు పొలాల్లోనే టమాటాను విడిచిపెడుతున్నారు. మార్కెట్‌కు అధిక మొత్తంలో సరకు రావడం, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు రాకపోవడమే ధరల పతనానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సుమారు వెయ్యి ఎకరాల్లో టమాటా సాగు..

దేవరాపల్లి మండలంలో దేవరాపల్లి, రైవాడ, శ్రీరాంపురం, శంభువానిపాలెం, కాశీపురం, నాగయ్యపేట, సీతంపేట, మారేపల్లి, చేనులపాలెం, పెదనందిపల్లి, చిననందిపల్లి, తెనుగుపూడి తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో టమాటా సాగు చేశారు. ఎకరా సాగుకు ఎరువులు, సస్యరక్షణ కలిపి సుమారు రూ. 30 వేల వరకు ఖర్చు కాగా ప్రస్తుతం కనీసం రూ. 5 వేలు వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి..

పండించిన పంటను నిల్వ ఉంచేందుకు కాయగూరల మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పండిన పంటలు నిల్వ చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థానిక మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకోవాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని కాయగూరల రైతులు ముక్త కంఠం కోరుతున్నారు.

రవాణా చార్జీలు కూడా రాలేదు..



ఎకరం విస్తీర్ణంలో టమాటా సాగు చేశాం. వారం, పది రోజుల క్రితం వరకు టమాటా ధర క్రేటు సుమారు రూ. 300 నుంచి రూ.400 వరకు పలికింది. ఆదివారం దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో క్రేటు రూ. 80 మాత్రమే పలికింది. ఈ ధరకు కూడా బలంతంగా అమ్మాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం రవాణా చార్జీలు కూడా రావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–దొగ్గ అవతారం, టమాటా రైతు, శ్రీరాంపురం

శ్రమే మిగులుతోంది..



ఆరుగాలం కుటుంబమంతా కష్టపడి సాగు చేస్తే చివరకు శ్రమే మిగులుతోంది. ఎకరాకు సుమారు రూ. 30 వేల వరకు పెట్టుబడి పెడితే కనీసం రూ. 5 వేలు వచ్చే పరిస్థితి లేదు. కిలో టమాటా రూ. 2 పలకడం దారుణం. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నా మద్దతు ధర మాత్రం పెరగడం లేదు. ప్రభుత్వం స్పందించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలి.

– గేదెల సూరిబాబు, టమాటా రైతు, దేవరాపల్లి

టమాటా.. వంకాయ ధరలు పడిపోయాయి..



టమాటాతో పాటు వంకాయ ధరలు కూడా దారుణంగా పడిపోయాయి. 1 క్రేటు తెల్ల వంకాయల ధర రూ. 100 మాత్రమే పలికింది. ఉదయం 6 గంటల మార్కెట్‌కు రాగా 11 గంటల వరకు చూసి తప్పని పరిస్థితిలో రూ. 100కి అమ్ముకున్నాను. కాయగూరల రైతులంతా పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– గోకాడ ఈశ్వరరావు, వంగ రైతు, దేవరాపల్లి

షాకిచ్చిన కరెంట్ బిల్లు

- రూ.1.60 లక్షల విద్యుత్ బిల్లుతో గుండెలు బాదుకున్న గిరిజన కుటుంబం
- డోలవానిపాలెంలో పలువురికి రూ.వేలల్లో బిల్లులు
- ఆగ్రహం చెందుతున్న గిరిజనులు



విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో ఆగ్రహం చెందుతున్న డోలవానిపాలెం గ్రామ గిరిజనులు



నాగరాజు కుటుంబానికి రూ.27 వేలకు పైగా అందించిన బిల్లు

రావికమతం : గిరిజన తండాలో ఉచిత కరెంట్‌కు మంగళం పాడేలా కూటమి సర్కార్ చర్యలు చేపట్టింది. 200 యూనిట్ల వరకు గిరిజనులకు ఉచిత విద్యుత్ అందించాల్సి ఉండగా అమాయక గిరిజనులకు రూ.లక్షలు, వేలల్లో బిల్లులు అందించి వారిని షాక్‌కు గురయ్యేలా చేసింది. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం డోలవానిపాలెం గ్రామానికి చెందిన డోలా సత్తిబాబుకి రూ.లక్షా 60 వేలు బిల్లు అందించారు. సత్తిబాబు ఇంటి వద్ద లేకపోగా కరెంట్ బిల్లు అందుకున్న అతని తల్లి లక్ష్మి రూ.లక్షల్లో వచ్చిన విద్యుత్ బిల్లును చూసి గుండెలు బాదుకుంటూ ఇదేమి మోసమంటూ ఆవేదన చెందింది. ఇదే గ్రామానికి చెందిన గాది నాగరాజుకు చెందిన సర్వీస్ నెంబర్ 11564జి364000004కు రూ, 27,913 బిల్లు అందించారు. ఇదేవిధంగా ఆ గ్రామంలో పలువురికి రూ.వేలల్లో బిల్లులు రావడంతో గిరిజనులు ఆగ్రహం చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు తగ్గించకపోతే ఆందోళనకు దిగుతామని డోలవానిపాలెం గ్రామస్తులు హెచ్చరించారు.

అవగాహన సదస్సుకు విశేష స్పందన



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న చైర్మన్ తిరుమలరావు

నక్కపల్లి/పాయకరావుపేట: స్థానిక తిరుమల విద్యా సంస్థల్లో 5,6,7,8,9,10 తరగతుల విద్యార్థులకు యాజమాన్యం ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజినీరింగ్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ నీట్ పరీక్షల్లో ఎంతో పోటీ ఉంటుందన్నారు. ఈ ఒత్తిడిని తట్టుకుని పిల్లలు నిలవాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. మానసికంగానే కాకుండా శారీరకంగా దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలన్నారు. అపుడే వారు వృద్ధిలోకి వస్తారన్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకంటే ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకి ఎక్కువగా అలవాటు పడుతున్నారన్నారు. పుస్తకాల కన్నా మొబైల్స్‌తో ఎక్కువ సేపు గడిపితే వచ్చే నష్టం గురించి తల్లిదండ్రులు వివరించాలన్నారు. విద్యా సంస్థల డైరెక్టర్ సరోజనీదేవి మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులను అనుకరిస్తారని, తల్లిదండ్రులే వారికి రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. సరైన మార్గంలో పెంచాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సత్యనారాయణమూర్తి, నూకలక్ష్మి మాట్లాడుతూ విద్యా సంస్థ పిల్లలను సొంత బిడ్డల్లా చూస్తుందన్నారు. విద్య, ఆరోగ్యం, వసతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో విద్యా సంస్థల ప్రిన్సిపాల్ శ్రీహరి, పాయకరావుపేట ప్రిన్సిపాల్ కె. విజయ్‌కుమార్, స్కూల్ ఇన్‌చార్జి ఎం. సునీత తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము



కార్మికులను పరామర్శిస్తున్న సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము

రాంబిల్లి (యలమంచిలి) : రాంబిల్లి మండలం ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని ఫార్మా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఇటీవల రాంబిల్లి మండలం గురుజాపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న క్రిస్టల్ ఫార్మా కెమికల్ పరిశ్రమలో రసాయనాలు లీకై అస్వస్థతకు గురై అచ్యుతాపురంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆదివారం ఆయన కలిసి పరామర్శించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టల్ ఫార్మా కెమికల్ పరిశ్రమలో రసాయనాలు లీకై తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం మెరుగైన వైద్యసేవలందించాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుశీల్ ఒరియన్ (23) ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి ఎస్ఈజెడ్ లో ఫార్మా పరిశ్రమల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు నిత్యం తనిఖీలు చేసి భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, సేఫ్టీ ఆడిట్ నిర్వహించి రిపోర్టులు బహిర్గతం చేయాలని, క్రిస్టల్ పరిశ్రమలో జరిగిన ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకొని అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి కుటుంబ సభ్యులు

మునగపాక : తిమ్మరాజుపేటలో కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, కృష్ణారావు కుటుంబ సభ్యులు ధ్వజస్తంభం నిమిత్తం తమవంతు విరాళంగా రూ.5 లక్షలను ప్రకటించారు. ఆదివారం కమిటీ సభ్యులకు మొదటి విడతగా రూ.1.70 లక్షలు అందజేసి భక్తిని చాటుకున్నారు. కాగా భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

కమనీయం.. కేశవస్వామి కల్యాణం

కన్నులపండువగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశవస్వామివారికి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

చోడవరం: శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశవ స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి 752వ. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వారం పాటు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. దీనిలోభాగంగా స్వామివారి కల్యాణం శనివారం అర్ధరాత్రి అంగరంగవైభవంగా జరిగింది. కల్యాణాన్ని చూసేందుకు వందలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం పెళ్లిసందడి నెలకొంది. ప్రత్యేకంగా రకరకాల పండ్లు, పూలతో అలంకరించిన కల్యాణ మండపంలో శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశవస్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా కల్యాణాన్ని జరిపారు. ఆస్థాన అర్చకులైన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. గోవిందా...గోవింద అంటూ కల్యాణవేదిక ప్రాంగణమంతా మారుమోగింది. స్వామివారి తరపున తాళిబొట్టును శ్రీదేవి, భూదేవికి వేసి, ముత్యాల తలంబ్రాలు వేసి కల్యాణం కమనీయంగా జరిపారు. పట్టువస్త్రాలు ధరించిన జంటలు ఈ కల్యాణంలో పాల్గొని స్వామివారికి కల్యాణం జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చన చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు బృందం పురందరదాసు కీర్తనలు ఆలపించారు. సరిపల్లి భాగ్రమ్మ, పావని అన్నమయ్య సంగీతఝురి ఆధ్వర్యంలో సంపూర్ణ సుందరకాండ పారాయణం చేశారు.

ఆటో చోరీపై కేసు నమోదు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని దిమిలి రోడ్డు కూడలి వద్ద నిలిపి ఉంచిన ఆటో చోరీకి గురైంది. ఈ నెల 8వ తేదీ ఉదయం ఇక్కడ నిలిపి ఉంచిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయినట్టు కోనవాని పాలేనికి చెందిన సర్వసిద్ధి వరహాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దిమిలి రోడ్డు కూడలి వద్ద తన ఆటోను నిలిపి ఉంచి కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లి వచ్చేసరికి తన ఆటో కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి ఆదివారం రాత్రి మీడియాకు తెలిపారు. ఆ ప్రాంతాలతో పాటు పట్టణంలోని అన్ని ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

కంటి వెలుగులు.. కన్నీటిపాలు



రాంబిల్లి వాడపాలెం సముద్రతీరం వద్ద సహాయక, గాలింపు చర్యల్లో రాంబిల్లి, మెరైన్ పోలీసులు

▶7వ పేజీ తరువాయి

చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో మృతిచెందాడు. సూర్యతేజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించగా సమాచారం అందుకున్న రాంబిల్లి పోలీసులు, మెరైన్ పోలీసులు,స్థానిక మత్స్యకారుల సహాయంతో తీరం వెంబడి పవన్‌తేజ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. పరవాడ డీఎస్పీ విశ్వస్వరూప్ సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు.వాడపాలెం తీరం అంతా గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి అవడంతో పోలీసులు అక్కడే ఉండి పర్యక్షించాలని ఆదేశించారు. కొత్తపేట గ్రామానికి చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారన్న వార్త తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు విశాఖపట్నం నుంచి విద్యార్థుల స్నేహితులు వాడపాలెం తీరం వద్దకు వచ్చి కన్నీరుమున్నీరయ్యారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు పోతున్నాయి : స్థానిక మత్స్యకారులు

వాడపాలెం తీరం ఒకప్పుడు చాలా విశాలంగా, అందంగా ఉండేది. ప్రస్తుతం నేవల్‌బేస్ ప్రాజెక్ట్ నిర్మాణం, డ్రెడ్జింగ్ పనులు, సముద్రంలో తవ్వకాల వల్ల వాడపాలెం తీరం లోతుగా మారిపోయిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు సముద్రం భారీగా కోత పడుతుందని స్థానిక మత్స్యకారులు అంటున్నారు.తీర ప్రాంతం అంతా పెద్ద పెద్ద ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. వీటిని పొక్లెయిన్‌లతో తొలగించాలని లేకపోతే ప్రమాదాలు సంభవిస్తాయని ఎన్నోమార్లు స్థానిక రెవెన్యూ, మెరైన్, పోలీసులకు ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోలేదని దీని వల్ల ఇక్కకు విహారానికి వచ్చే సందర్శకులు సముద్రం లోతు తెలియక మునిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అంటున్నారు. ఇప్పటికైనా సముద్రంలో ఇసుక తిన్నెలు తొలగించాలని, మరో రెండు రోజుల్లో మాఘపౌర్ణమి సందర్భంగా వాడపాలెం తీరంకు అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని, కాబట్టి తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

దళితులకు డిప్యూటీ స్పీకర్ క్షమాపణ చెప్పాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల జేఏసీ నాయకులు

నర్సీపట్నం: డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు భూదందాలు, దాడులను నిరసిస్తూ నర్సీపట్నం మాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అబిద్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమ్‌రావ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బొట్టా నాగరాజు, ఏఐఎం నాయకులు సాల్మన్‌రాజు, అల్లంపల్లి ఈశ్వరరావు, రావాడ ప్రకాష్, జేఏసీ నాయకులు మర్రా గోపి, మైలపల్లి అప్పారావు, చెవ్వల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి, అన్యాయంగా దళితుల భూములు లాక్కోవటం , మాట వినకపోతే దాడులు చేయటం దారుణమన్నారు. అన్యాయంగా పేదల పొట్ట కొడుతున్నారన్నారు. దళితుల జోలికొస్తే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తక్షణమే దళితులకు క్షమాపణలు చెప్పి, వారి భూములు వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు




ఉపాధ్యాయులు, విద్యార్థులతో సత్తిపండు

ఎస్.రాయవరం: టెన్త్ విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధించగలరని ప్రముఖ వెండితెర, బుల్లితెర నటుడు జబర్దస్త్ సత్తిపండు అన్నారు. పాయకరావుపేట విచ్చేసిన ఆయన ఆదివారం పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో సందడి చేశారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు సత్తిపండును ఘనంగా సత్కరించారు. సత్తిపండు పల్లె గ్రామాల్లో పర్యటించి స్థానికులను ఉత్తేజపరిచారు. పాఠశాలలో ఆదివారం ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుని పట్టుదలతో చదవాలన్నారు. అనారోగ్యం కలిగించే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఫొటోలు దిగారు.

గీత కులాల మద్యం షాపుల లాటరీ వాయిదా

సాక్షి, అనకాపల్లి : కల్లుగీత, వాటి అనుబంధ కులాలకు కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ తెలిపారు. ఈ నెల 10వ తేదీన అనకాపల్లి టౌన్‌లో గల గుండాల జంక్షన్‌లో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించాల్సిన కల్లుగీత కులాలకు కేటాయించిన 14 మద్యం దుకాణాలను లాటరీ ప్రక్రియ ఎప్పుడనేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఉపాధ్యాయ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఈ లాటరీ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయం నుంచి ఆయన మీడియాకు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వీటికి డ్రా తీయడం జరుగుతుందని, తదుపరి షెడ్యూల్ రెండు, మూడు రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు. గీత కులాల వారికి లైసెన్స్ ఫీజులో 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రోలుగుంట, యలమంచిలి రూరల్, చీడికాడ మండలాలకు గానూ 2024–25 ఏడాదిలో మిగిలిన 8 నెలలకు గానూ రూ.18,33,334, 2025–26 ఏడాదిలో రూ.30,25,000 చెల్లించాల్సి ఉంటుంది. అనకాపల్లి రూరల్, మునగపాక, కోటవురట్ల, మాకవరపుపాలెం, నాతవరం, రాంబిల్లి, దేవరాపల్లి, బుచ్చియ్యపేట, పాయకరావుపేట, నక్కపల్లి, వి.మాడుగుల, రావికమతం మండలాలకు గానూ 2024–25లో రూ.21,66,667, 2025–26లో రూ. 35,75,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

జిల్లాలో 4 కల్లుగీత ఉపకులాలు..



జిల్లాలో కల్లుగీత కులాలకు 15 మద్యం దుకాణాలను కేటాయించారు. వీటిలో కల్లుగీత కులంలో 4 ఉపకులాలున్నాయి. శెట్టి బలిజకు 9 షాపులు, యాత కులానికి 4 షాపులు, గౌడ కులానికి 1, గౌడ్ కులానికి ఒక షాపును కేటాయించారు. ఉప కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడినట్లు పేర్కొన్నారు.

– వి.సుధీర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

అప్పు తీర్చలేదని ఇంటికి తాళం

- లచ్చన్నపాలెంలో ఘటన
- కుటుంబంతో ఆరుబయటే నిద్రించిన బాధితురాలు



ఈశ్వరమ్మ ఇంటికి తాళం వేసిన దృశ్యం



ఇంటి బయట నిద్రిస్తున్న ఈశ్వరమ్మ, మనుమరాళ్లు

మాకవరపాలెం : కొడుకు తీసుకున్న అప్పు తీర్చలేదంటూ తల్లి నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసిన ఘటన మండలంలోని లచ్చన్నపాలెంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి ఈశ్వరమ్మకు ఇద్దరు కొడుకులు. వీరిలో చిన్నకొడుకు హరి గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పని చేసేవాడు. అయితే గతేడాది ఫిబ్రవరి 1న ఇదే గ్రామ శివారులో హత్యకు గురయ్యాడు. హరి మరణించిన అనంతరం గ్రామానికి చెందిన లాలం శ్రీను అనే వ్యక్తి వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, ఈ నగదు ఇవ్వాలంటూ తల్లి ఈశ్వరమ్మను గత కొన్ని రోజులుగా శ్రీను అడుగుతున్నాడు. తనకు తెలియదని చెప్పినా వినకుండా తనతో బలవంతంగా సంతకాలు పెట్టించినట్టు ఈశ్వరమ్మ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అప్పు తీర్చకపోవడంతో ఆదివారం శ్రీను తన ఇంటికి తాళం వేసినట్టు తెలిపింది. దీంతో రోడ్డున పడ్డామని వాపోయింది. ఇంటికి తాళం వేయడంతో ఈశ్వరమ్మ, పెద్ద కొడుకు, ఇద్దరు పిల్లలతో ఆరుబయటే ఉండడమే కాక రాత్రి ఇంటి బయటే నిద్రించాల్సి వచ్చింది. ఉన్నట్టుండి పిల్లలతో ఎక్కడికి వెళ్లేదని, తమకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి



ఎమ్మెల్సీ గౌరిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని కోరుతూ మండలంలోని తుమ్మపాలలో ఆదివారం ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపైన, హక్కులపైన నిరంతరం పోరాడే యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరిని గెలిపించాలని కోరారు.

వెలుగు వీవోఏ ఉషకు సత్కారం



ఉషను సత్కరిస్తున్న వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం నాయకులు

అనకాపల్లి: ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మునగపాక మండలం టి. సిరసపల్లికి చెందిన వెలుగు వీవోఏ పొలమరశెట్టి ఉషను ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్ రూపాదేవి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసినందుకుగానూ గణతంత్ర దినోత్సవంలో ఆమె అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. వీవోఏలు అంకిత భావానికి ఈ అవార్డు నిదర్శనమని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు, అధ్యక్షుడు కె.సూరిబాబు, కోశాధికారి కె. లక్ష్మీ ప్రసన్న, వై.లక్ష్మి, వెంకటలక్ష్మి, త్రినాథ్ పాల్గొన్నారు.

గాయపడ్డ మిత్రుడికి ఆర్థిక సాయం



ఆనందం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం: తమతో కలిసి చదువుకున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పూర్వ విద్యార్థులు ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించి, తమ మైత్రిని చాటుకున్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన శ్రీకాకుళపు ఆనందం ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తూరోడ్డు ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడ్డాడు. కాలు విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న తన టెన్త్ బ్యాచ్(2005–06) విద్యార్థులు ఆనందం ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. తనకు అండగా నిలిచిన మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు గొంప లక్ష్మణ, గండి ఆలీ, జి.రమేష్, సీహెచ్ రాంబాబు, ప్రకాష్, గుదే నాగరాజు తదితరులు ఉన్నారు.

15 క్వార్టర్ మద్యం సీసాల స్వాధీనం

అనకాపల్లి (కశింకోట): అనకాపల్లి మండలం చింతనిప్పుల అగ్రహారంలో ఒక దుకాణంపై దాడి చేసి 15 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న ఎ. లక్ష్మీనారాయణను అరెస్టు చేశామన్నారు.

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం	: సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
పట్టుదల	: వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	: శ్రీసత్య (ఉదయం, మొదటి షో)
మదగజరాజ	: శ్రీసత్య(మేట్నీ, రెండో షో)
భవాని వార్డు	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 92 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్ – 10 యూనిట్లు, బీ పాజిటివ్– 30 యూనిట్లు, ఓ పాజిటివ్–48 యూనిట్లు, ఏబీ పాజిటివ్ – 3 యూనిట్లు, శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706) నెంబర్‌ను సంప్రదించవచ్చు.

జంక్షన్.. టెన్షన్



రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద ప్రమాదకరంగా రోడ్లు

- వేల్పులవీధిలో ప్రమాదకరంగా నాలుగు రోడ్లు
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని కూటమి పాలకులు

అనకాపల్లి టౌన్: సమస్య చిన్నదే. దాని పర్యావసనం మాత్రం పెద్దది. గుంతల రోడ్లు వల్ల పలువురు వాహనదారులు గాయాల పాలవుతున్నారు. సంక్రాంతి పండగకు వీటిని పూడ్చి వేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. పట్టణంలోని వేల్పులవీధి రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద నాలుగు రోడ్ల జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ నాలుగు వైపులా రోడ్లకు సమాంతరంగా జంక్షన్ రోడ్డు లేదు. గొయ్యిలా ఏర్పడటంతో వాహనదారులు రాకపోకల సమయంలో బోల్తాపడి గాయాల పాలవుతున్నారు.

ఈ జంక్షన్‌లోనే అధికంగా రాకపోకలు..

ఈ జంక్షన్ అత్యంత ప్రాధాన్యమైనది. ఇక్కడ ప్రసిద్ధి గాంచిన కాశీవిశ్వేశ్వర ఆలయం, సాయిబాబా మందిరం, సంతోషీమాత దేవాలయం, శనీశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాలు, యోగా సెంటర్, ఇతర వ్యాపార సంస్థలు, దగ్గరలోనే రైల్వే స్టేషన్ వంటివి ఉన్నాయి. నిత్యం ఈ రోడ్డుపై వందలాది మంది మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు కార్లు, మోటార్ సైకిళ్లపై ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ఒక రోడ్డు నుంచి వచ్చి మరొక రోడ్డుకు తిరిగేటప్పుడు కింద పడిపోతున్నారు. ఆ సమయంలో పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. పాదచారులు సైతం రోడ్డుపై తేలిన రాళ్లను తన్నుకుని గాయపడుతున్నారు. దీనికి పరిష్కార మార్గంగా మరమ్మతులు లేదా కొత్తగా రోడ్లు వేయడం వంటి చర్యలు అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులుగానీ తీసుకోవడం లేదు. దాంతో ఈ మార్గంలో ప్రయాణమంటే వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు మధ్యలో గుంత

మరమ్మతులు చేయాలి

రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద నాలుగు రోడ్ల జంక్షన్ లోతుగా ఉంటోంది. దాంతో పిల్లల్ని స్కూల్‌కు తీసుకు వెళ్లేటప్పుడు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. తక్షణమే ఈ జంక్షన్ రోడ్లను మరమ్మతులు చేపట్టాలి.

– ద్రాక్షారపు శ్రీనివాసరావు, అనకాపల్లి

నాయకులకు విన్నవించినా ఫలితం లేదు



ఎన్నో సార్లు అధికారులకు, స్థానిక నాయకులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. ఏమి చేయాలో తెలియడం లేదు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ఎక్కడ గాయాలవుతాయోనని భయమేస్తోంది. ఈ రోడ్డు మూసివేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

– శీంభోట్ల శ్యామ్ ప్రసాద్, అనకాపల్లి

ఘనంగా సారె ఊరేగింపు



ఆలయంలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన సారె

అనకాపల్లి: స్థానిక విజయరామరాజు పేట మరిడిమాంబ అమ్మవారి ఆలయం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సారె ఊరేగింపు జరిగింది. మహిళలు వివిధ రకాలైన పిండి వంటలు తయారు చేసి ఊరేగించారు. వీధి పరిసర ప్రాంతంలో ఊరేగించిన అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ, కార్యదర్శి పలకా రాము, ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్ట బుద్దేశ్వరరావు, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



విజయరామరాజు పేటలో సారె ఊరేగింపు

గ్రీన్ క్లబ్ సభ్యుల కృషి అభినందనీయం



దేవస్థానం ఆవరణలో మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కొబ్బరి, మామిడి, ఉసిరి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకుడు భీమరశెట్టి రాంకీ హాజరై మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులను అభినందించారు. సూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళీ, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరావు, క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్, కొడమంచిలి సుందరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాలు జారి పడి ఒకరి మృతి

అనకాపల్లి(కశింకోట): అనకాపల్లి వద్ద శారదా నదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు ట్రైనింగ్ డీఎస్పీ చైతన్య ఆదివారం తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన షేక్ ఇస్మాయిల్ అనకాపల్లి శారదానగర్‌లో తన చెల్లెలు ఇంటికి ఈ నెల 5న వచ్చాడన్నారు. అతను సమీపంలోని శారదా నదికి బహిర్భూమి కోసం వెళ్లి కాలు జారి నదిలో పడి మృతి చెందాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కశింకోట: తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి మనీషా తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా స్కూళ్లు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మింగించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, నిర్దేశిత వయస్సు పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు.

వైభవంగా అభయాంజనేయస్వామి తీర్థం

కశింకోట: అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి పూజలు జరిపారు. విశాఖ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, సర్పంచ్ మలసాల ధనమ్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మలసాల కుమార్‌రాజా, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులు దర్శించి పూజలు చేశారు. తీర్థం సందర్భంగా మహిళల అలంకరణ వస్తువులు, ఆట వస్తువులు, తినుబండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. కోలాటాలు, తోడపెద్దు సేవ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు మాధవస్వామి జాతర

- ముత్యాలమ్మపాలెంలో కొలువైన మాధవస్వామి
- తీరంలో జాగరణ స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు





కొలువుదీరిన మాధవస్వామి, భక్తుల పుణ్యస్నానాలకు అనువైన ముత్యాలమ్మపాలెం తీరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో కొలువుదీరిన శ్రీ మాధవస్వామి తీర్థమహోత్సవానికి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మంగళవారం రాత్రి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. తీర్థ మహోత్సవంలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. ముత్యాలమ్మపాలెం కూడలి నుంచి తీరం వరకు రంగు రంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు.

వేలాదిగా తరలిరానున్న భక్తులు

ఇక్కడ తీర్థ మహోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ, అనకాపల్లి, సబ్బవరం, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, తోటాడ, వెంకటాపురం, భర్నికం, తానాం, లంకెలపాలెం, పెదముషిడివాడ, పరవాడ, దీపాంజలినగర్, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. బస్సులు, ద్విచక్ర వాహనాలపై మంగళవారం సాయంత్రానికే తీరానికి చేరుకుంటారు. రాత్రంతా తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక తిన్నెలపై ఆట పాటలతో జాగరణ చేస్తారు. జాగరణ చేసే భక్తుల కోసం ఉత్సవ కమిటీ తీరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. జాగరణ చేసిన భక్తులు బుధవారం సూర్యోదయాన తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని ఆలయంలో కొలువుదీరిన మాధవస్వామిని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు.

ఉచిత సేవలు.. ప్రత్యేక ఏర్పాట్లు

తీరంలో పుణ్య స్నానాలు ఆచరించే సమయంలో భక్తులు గల్లంతవకుండా పర్యవేక్షించేందుకు వీలుగా గజ ఈతగాళ్లను నియమించారు. భక్తులకు మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మహిళా భక్తుల కోసం తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలను పార్క్ చేయడానికి ముత్యమాంబ ఆలయం సమీపంలో ప్రత్యేక పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే భక్తుల కోసం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో నుంచి 10 అదనపు బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

భక్తులకు ప్రత్యేక సదుపాయాలు



మాధవస్వామి తీర్థ మహోత్సవంలో పాల్గొనే భక్తుల కోసం తీరంలో ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నాం. మహిళలకు తాత్కాలిక మరుగు దొడ్లు నిర్మాణం చేపట్టాం. సముద్ర స్నానాలు చేసేవారి భద్రత దృష్ట్యా తీరంలో గజ ఈతగాళ్లను నియమించాం. భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, ప్రసాదం అందజేయనున్నాం. మంగళవారం రాత్రి జాగరణ చేసే భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ వసతిని ఏర్పాటు చేశాం.

– సూరాడ సోమునాయుడు, ఆలయ కమిటీ చైర్మన్

ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు



తీర్థ మహోత్సవంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు తీరంలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరిస్తున్నాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. సముద్ర స్నానాలు చేసే భక్తుల కోసం మైకుల ద్వారా హెచ్చరికలు చేయడానికి సిబ్బందిని నియమిస్తున్నాం. తీరం వద్దకు వాహనాలను అనుమతించబోం. ముత్యమాంబ ఆలయం నుంచి భక్తులు కాలినడకనే తీరానికి వెళ్లాలి.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

ఘనంగా గౌరీపరమేశ్వరుల

నిమజ్జనోత్సవం



శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం





రథం వెంట మహిళలు భజన పాటల ఆలాపన



ఉత్సవంలో సాంస్కృతిక ప్రదర్శనలు

కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని రథం లాగారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. గౌరమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గవరపేట మధ్య వీధి మీదుగా పెద్ద గుమ్మం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆర్కెస్ట్రాతోపాటు సంప్రదాయ డప్పులతో ఊరేగించారు. మహిళలు రథం వెంట భక్తి పాటలు పాడారు. అనంతరం గౌరమ్మకు వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా పూజలు జరిపారు. మృదంగ వాయిద్యకారుడు సిరిపల్లి నరసింగరావును ఉత్సవ కమిటీ తరపున సత్కరించారు. అనంతరం శారదా నదిలో ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్, బుర్ర కథలు ఆహుతులను అలరించాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, కోయిలాడ నాగు, పెంటకోట తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై గోతులు పూడ్చాలని సీపీఐ నిరసన

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల బ్రిడ్జిపై గోతులు పడడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు ఆగ్రహించారు. వీటిని బాగుచేయాలని ఆదివారం ఇక్కడ బ్రిడ్జిపై పార్టీ నాయకులతో ఆయన నిరసన చేపట్టారు. బ్రిడ్జి రోడ్‌కు మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. చాలా ప్రాంతాల్లో రోడ్లకు మెక్కుబడిగా మరమ్మతులు చేసి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. నిత్యం ఈ ప్రాంతంలో క్వారీ లారీలు అధిక లోడుతో వెళ్లడం వల్ల రోడ్లు గుంతలుగా మారిపోయాయని, తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలు ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. సన్యాసిరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు, సీపీఐ నాయకులు కె. వీరాచారి, విత్తనాల పోతురాజు, రామారావు, ఎన్. సత్యనారాయణ, ఎం. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



గోతులు పడ్డ బ్రిడ్జిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు


పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీఆర్పీఏ కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు పి. బాబూజీ, కాకినాడ డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు, సిహెచ్ వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీఆర్పీఏ అనకాపల్లి డివిజన్ పదో వార్షిక సమావేశం రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు సిహెచ్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ పద్ధతి తిరిగి అమలు చేయాలని, కరోనా సమయంలో నిలుపుదల చేసిన 18 నెలల డీఆర్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సర్వీస్ సౌకర్యాలు మెరుగుపరచాలని, ఎన్వీస్ పెన్షనర్లకు సీజీహెచ్ఎస్, ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్ అమలు చేయాలని, ఏడాది సర్వీస్ పూర్తి చేసి 2006 సంవత్సరం తర్వాత జూన్, డిసెంబర్లో రిటైరైన వారికి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో డివిజనల్ సంఘం కోశాధికారి టి. కోటేశ్వరావు, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

ముంచు ముసుగులో పట్టణం



రైల్వే స్టేషన్



శారదానది



రింగ్ రోడ్‌లో మంచు

అనకాపల్లి టౌన్: దట్టమైన మంచు కురవడంతో పట్టణ పరిసరాలు మన్యాన్ని తలపించాయి. సాధారణంగా మంచు అందాలు చూడాలంటే ఏజెన్సీ వెళ్లాల్సిందే. అదివారం మాత్రం పట్టణంలో అధికంగా మంచు కురిసింది. దాంతో ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడలేదు. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు, వివిధ పనులు మీద వెళ్లే ప్రజలు కొద్ది పాటి ఇబ్బందులు పడ్డారు. ఫిబ్రవరిలో రథసప్తమి వెళ్లిన తర్వాత ఎండలు దంచుతాయి. అందుకు భిన్నంగా మంచు కురుస్తుండటంతో మామిడి పూతకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక సంక్షేమం కోసం ఆనంద్ మేళా

పరవాడ: భారతీయ వారసత్వాన్ని, సామాజిక సంక్షేమాన్ని పరిరక్షించాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ అన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్ సాధన క్రీడా మైదానంలో 'ఎ ఫెయిర్ ఆఫ్ జాయ్ విత్ ఎ ఫ్యూజన్ ఆఫ్ కల్చర్ అండ్ కలర్స్' నినాదంతో శని, ఆదివారాల్లో నిర్వహించిన సింహాద్రి ఎన్టీపీసీ ఆనంద్ మేళా– 2025ను మాజీ భద్రతా సలహాదారు వెంకట రవిరామ్ పిన్నింటితో కలిసి, ప్రారంభించారు. ఈ మేళాలో ప్రాంతీయ వంటకాలు, జానపద నృత్యాలు, సాంప్రదాయ కార్యకలాపాలతో సహా విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. దీపికా లేడీస్ క్లబ్ సహకారం ఎంతో కీలకమని కొనియాడారు.